
సాక్షి
జగిత్యాల
సోమవారం ౹ 24 ౹ మార్చి ౹ 2025



మల్లన్న స్వామికి పట్నాలు

మల్లాపూర్: మండలకేంద్రంలో యాదవ సంఘం శ్రీమల్లికార్జున స్వామికి బోనాలు చేశారు. పూజారులు పట్నాలు వేసి స్వామివారి చరిత్రను ఒగ్గుకథ రూపంలో వివరించారు.



ప్రశాంతంగా బ్రహ్మోత్సవాలు

ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహుని బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి. స్వామివారి ఆలయంలో ఈనెల 10 నుంచి 22వరకు వైభవంగా నిర్వహించారు. 8లో▸

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ సోమవారం (సా॥)	సహర్ మంగళవారం (ఉ॥)
కరీంనగర్	6.29	4.57
పెద్దపల్లి	6.33	4.55
సిరిసిల్ల	6.28	5.05
జగిత్యాల	6.32	5.01

బల్దియా స్థలాల ఆక్రమణ



- ఇది జిల్లాకేంద్రంలోని కొత్తబస్టాండ్ ముందు నిర్మించిన వ్యాపార సముదాయాలు. అద్దెకు తీసుకున్నవారు దుకాణాలను మించి మున్సిపల్ స్థలాన్ని ఆక్రమించి షెడ్లు వేసుకున్నా అడిగేవారు లేరు. ఫలితంగా ఆ ప్రాంతం రద్దీగా ఉండటంతోపాటు ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఆర్టీసీ యజమాన్యం నోటీసులు ఇచ్చినా ఎవరూ పట్టించుకోవడం లేదు.



ఈ చిత్రంలో కనిపిస్తోంది జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ఎదురుగా ఉన్న ఉద్యానవనానికి సంబంధించిన స్థలం. ఈ స్థలాన్ని ఆక్రమించి పండ్ల దుకాణాలు, హోటల్స్, టీస్టాల్స్ ఏర్పాటు చేశారు. అయినా మున్సిపల్ అధికారులు పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నారు. ఆ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తే మున్సిపాలిటీకి ఆదాయం వచ్చే అవకాశం ఉంది. స్థలాన్ని ఆక్రమించుకున్న వారి నుంచి కొందరు అమ్యామ్యాలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.



- ఇది జిల్లాకేంద్రంలోని పాతబస్టాండ్ వద్ద నున్న మున్సిపల్ కాంప్లెక్స్ ఎదుట దర్జాగా కబ్జా చేసుకున్నారు. ఇటీవల దానికి మెట్లు ఉండగా.. రోడ్డు వెడల్పు అని దానిని కూల్చివేసినప్పటికీ వాహనాలు పార్కింగ్ చేయడంతోపాటు, పండ్ల వ్యాపారాలు చేసుకుంటున్నారు.



- ఇది కోరుట్ల మున్సిపాలిటీలోని ప్రధాన రోడ్డు. ఈ రోడ్డుపైనే దుకాణదారులు సామగ్రిని పెడుతున్నారు. ట్రాఫిక్ సమస్యతో ప్రజలు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. వ్యాపారులు పుట్‌పాత్‌లను సైతం ఆక్రమించుకుంటున్నారు.



- ఇది మెట్‌పల్లి పట్టణంలోని ప్రధాన రోడ్డు. రోడ్డుపైనే పార్కింగ్‌లతోపాటు, రేకులషెడ్లు లతో ముందుకు వస్తున్నారు. పార్కింగ్ సమస్య మారడంతో వెహికిల్స్ పెట్టుకోవాలంటే రోడ్డుపై పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

- పట్టింపులేని మున్సిపల్ అధికారులు
- కబ్జాకు గురవుతున్న విలువైన స్థలాలు
- సముదాయాలు నిర్మిస్తే బల్దియాకు ఆదాయం

జగిత్యాల: జిల్లాలో మున్సిపల్ అధికారులు అనుమతి లేకుండా ఇళ్ల నిర్మాణం చేపట్టినా.. సెట్‌బ్యాక్ లేకున్నా నోటీసులు లేకుండానే కూల్చివేస్తున్నారు. ఎవరైనా మున్సిపల్ కబ్జా చేసుకుంటే మాత్రం మున్సిపల్ అధికారులు స్పందించడం లేదు. నిర్మాణాలను ఎలా కూల్చివేస్తున్నారో స్థలాలను ఆక్రమించుకున్న వారిని సైతం వెళ్లగొట్టి స్వాధీనం చేసుకోవాలని పట్టణ ప్రజలు అభిప్రాయపడుతున్నారు. అద్దెకు దుకాణాలను తీసుకుని దాని ఎదుట మరో దుకాణం అంత రేకులషెడ్డుతో కబ్జా చేస్తున్నారు. ఇది అంతా అధికారుల కళ్ల ముందే జరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

అధికారుల పర్యవేక్షణ ఎక్కడ..?

జిల్లాలో వ్యాపార, వాణిజ్య కేంద్రాలు వెలిశాయి. ఇటీవల వ్యాపారాలు పెరగడం, ఎలాంటి సదుపాయాలు లేకుండా భవనాలు నిర్మించడం, పుట్‌పాత్‌లను సైతం ఆక్రమించి డ్రెయినేజీలపై కప్పులు వేసుకున్నా అధికారులు పట్టించుకోలేదు.

ఆదాయానికి భారీగండి

మున్సిపల్ స్థలాల్లో మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లను నిర్మిస్తే కోట్లాది రూపాయల ఆదాయం వచ్చే అవకాశం ఉంటుంది. అధికారులు, పాలకవర్గాలు పట్టించుకోకపోవడంతో ఆదాయానికి గండి పడుతోంది. గతంలో జిల్లాకేంద్రంలో అంగడిబజార్‌లో ఉన్న ఖాళీ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తే ఒక్కో షాపు రూ.4లక్షల నుంచి రూ.5 లక్షలతో టెండర్లు దక్కించుకున్నారు. కోట్లాది రూపాయల విలువ గల స్థలాల్లోని అక్రమణలను తొలగిస్తే జిల్లాకు ఆదాయం అధిక సంఖ్యలో లభిస్తుంది. మున్సిపల్ స్థలాల్లో అక్రమంగా షెడ్లు వేసుకున్న వారు మున్సిపల్‌కు కొంతమొత్తం మాత్రమే ఫీజు చెల్లిస్తున్నట్లు సమాచారం. షాపుల ముందు వరకూ సామగ్రిని పెట్టడం ద్వారా ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. జిల్లాకేంద్రంలో టవర్‌సర్కిల్, తహసీల్ చౌరస్తా, కొత్తబస్టాండ్, పాతబస్టాండ్ తదితర ప్రాంతాల్లో అధికంగా వాణిజ్య సముదాయాలున్నాయి. అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించేలా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. జిల్లాలో అతిపెద్ద మున్సిపల్ అయిన కోరుట్లలో సైతం ఇదే పరిస్థితి నెలకొంది.

ఫుట్‌పాత్ సౌకర్యం కల్పించాలి



పట్టణంలో నిర్మించిన పుట్‌పాత్‌లను వినియోగంలోకి తేవాలి. పుట్‌పాత్ సౌకర్యం ఉన్నప్పటికీ కొందరు ఆక్రమించుకుని వ్యాపారాలు చేస్తున్నారు. రోడ్ల వెంట నడవడం ప్రమాదకరంగా మారింది. మున్సిపల్ అధికారులు స్పందించి అవసరమైన చర్యలు చేపట్టాలి.

– నర్సింహాచారి, కోరుట్ల

ఆక్రమణలను తొలగించాలి



మెట్‌పల్లి పట్టణంలోని ఆక్రమణలను తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి. పుట్‌పాత్‌ల ఆక్రమణలు పెద్ద సమస్యగా మారాయి. రోడ్లపై నడవాలంటేనే నరకం కనిపిస్తోంది. కబ్జాదారులపై మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలి.

– నవీన్, మెట్‌పల్లి

పన్ను చెల్లించకుంటే రెడ్‌నోటీసులు జారీ చేయాలి

- కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల/మెట్‌పల్లి/రాయికల్ : బల్దియాల్లో సకాలంలో పన్ను చెల్లించకుంటే బకాయిదారులకు రెడ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు. ఆదివారం రాయికల్ బల్దియాలో ఎల్ఆర్ఎస్ చెల్లింపు, వివిధ రకాల పన్ను వసూళ్లను పర్యవేక్షించారు. ఆర్థిక సంవత్సరం ఈ నెల 31తో ముగియనున్న నేపథ్యంలో బల్దియాలో వందశాతం ఇంటి పన్ను వసూలు చేయాలన్నారు. ఇంటి పన్ను చెల్లించని వారితో కలెక్టర్ ఫోన్లో మాట్లాడారు. పన్ను చెల్లించాలని సూచించారు. చెల్లించని వారికి రెడ్‌నోటీసు జారీ చేయాలని, అప్పుడు కూడా పన్ను చెల్లించకపోతే నల్లా, కరెంట్ కనెక్షన్లు నిలిపివేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట కమిషనర్ మనోహర్‌గౌడ్, మేనేజర్ వెంకటి ఉన్నారు.

పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలి

పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. జిల్లాకేంద్రంలో నివార్డు అధికారులు లక్ష్యాలను నిర్దేశించాలని, ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు, ఇంటి పన్ను బకాయిదారులకు ఫోన్‌చేసి పన్ను చెల్లించేలా చూడాలన్నారు. ఆయన వెంట కమిషనర్ స్పందన, రెవెన్యూ అధికారులు ఉన్నారు. మెట్‌పల్లిలో ఇంటి పన్ను వసూళ్లు, ఎల్ఆర్ఎస్ అమలు తీరును పరిశీలించారు. ఆయన వెంట కమిషనర్ మోహన్ ఉన్నారు.



రాయికల్ మున్సిపల్ కార్యాలయంలో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

13 అసెంబ్లీ స్థానాలు గెలవాల్సిందే..



కేటీఆర్‌కు గజమాలతో స్వాగతం పలుకుతున్న గులాబీ శ్రేణులు



కేటీఆర్‌కు తిలకం దిద్దుతున్న జగిత్యాల జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ వసంత



వేదికపై కళాకారుల ఆటాపాట

- ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో కేటీఆర్
- చెక్‌పోస్టులు పెట్టి కాంగ్రెస్ లీడర్లు దోచుకుంటున్నారు: గంగుల
- ఉద్యమ వ్యతిరేకి చేతిలో రాష్ట్ర పగ్గాలు: ఈశ్వర్
- కేసీఆర్ ఒక తరాన్ని పరిచయం చేశారు: వినోద్‌కుమార్
- జోష్ నింపిన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ర్యాలీ, సమావేశం

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రజతోత్సవ వేడుకల వేళ పార్టీని మరింత బలోపేతం చేస్తామని, కార్యకర్తలకు జిల్లా కార్యాలయాల్లో శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేస్తామని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు అన్నారు. ఆదివారం కరీంనగర్‌లోని వీ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఉమ్మడి జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌ను సీఎం చేయడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ హయాంలో వివిధ వర్గాలకు జరిగిన అభివృద్ధిని అంకెలతో సహా వివరించేలా కార్యకర్తలు తయారవాలన్నారు. ఇందుకోసం పార్టీ అధిష్ఠానం నుంచి పరిశీలకులు, సమన్వయకర్తలు వస్తారని వెల్లడించారు. కేసీఆర్‌కు కరీంనగర్ అంటే ప్రత్యేకమైన అభిమానమని, సింహగర్జన నుంచి రైతుబంధు, దళితబంధు వరకు అనేక కార్యక్రమాలు ఇక్కడే మొదలుపెట్టారని గుర్తుచేశారు. గత ఎన్నికల్లో 13 స్థానాల్లో కేవలం ఐదు మాత్రమే గెలిచామని, అందులో జగిత్యాల ఎమ్మెల్యే కాంగ్రెస్‌లోకి వెళ్లారన్నారు. ఈసారి వచ్చే ఎన్నికల్లో 13 అసెంబ్లీ స్థానాలు మనమే గెలవాలని పిలుపునిచ్చారు.

చెక్‌పోస్టులు పెట్టి మరీ: గంగుల

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక చెక్‌పోస్టులు పెట్టి మరీ ప్రజల్ని పీల్చి పిప్పి చేస్తున్నారని మాజీమంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. బీఆర్ఎస్ హయాంలో మానేరు రివర్ ఫ్రంట్, తీగల బ్రిడ్జి వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు మొదలుపెడితే.. వాటిని ఖతం చేశారని, ఇదేంటని కాంట్రాక్టర్‌ను అడిగితే.. కాంగ్రెస్ హయాంలో అనేక మంది లీడర్లు ఇబ్బందులు పెడుతున్నారని వాపోయాడని చెప్పారు. అమాయక ప్రజలను చెక్‌పోస్టులు పెట్టి పీల్చిపిప్పి చేస్తున్నారని కట్టెలమోపు కథ ద్వారా వివరించారు.

ఉద్యమ వ్యతిరేకి చేతిలో..

ఆరు గ్యారంటీలు అమలు చేయకుండా పదేళ్ల రాష్ట్రాన్ని వెనక్కి తీసుకుపోయారని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. తెలంగాణ ప్రజలు ఎవరి పాలనలో అయితే సుఖశాంతులతో ఉంటారో దాని కోసం పోరాడాల్సిన సమయం వచ్చిందన్నారు. 'ఎన్నో పోరాటాలు, త్యాగాలతో రాష్ట్రం సాధించుకున్నాం. ఉద్యమానికి వ్యతిరేకంగా కరీంనగర్ ప్రజల మీదకు తుపాకీ పట్టుకుని వచ్చిన వాడి చేతిలో రాష్ట్రం ఉంది. ఈ చెర నుంచి విడిపించాల్సిన బాధ్యత మనపై ఉంది' అని పిలుపునిచ్చారు.

ఒక తరాన్ని పరిచయం చేశారు

బీఆర్ఎస్ పార్టీకి 25 ఏళ్లు నిండుతున్న సందర్భంగా వరంగల్‌లో గొప్ప సభ ఏర్పాటు చేయనున్నట్లు మాజీ ఎంపీ బి.వినోద్‌కుమార్ పేర్కొన్నారు. పార్టీకి ఎప్పుడు ఇబ్బందులు వచ్చినా ఆదుకునేది ఉమ్మడి వరంగల్, కరీంనగర్లే. కేసీఆర్‌ను శత్రువులు ఇబ్బందులు పెడితే, ఇక్కడికి వచ్చి గాలిపీలిస్తే ఆయనకు ఉత్తేజం వస్తదని తెలిపారు. 'ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ పెడితే అందులో కేసీఆర్ లీడర్‌గా ఎదిగారు. బీఆర్ఎస్ పార్టీ పెట్టినప్పుడు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, నేను పోటీ చేశాం. పిల్లగాళ్లు అని కాంగ్రెస్ వాళ్లు ఎగతాళి చేసినా గెలిచి చూపించాం. అలా కేసీఆర్ కొత్త తరాన్ని రాజకీయాలకు పరిచయం చేశారు. 33 శాతం రిజర్వేషన్లను ఆధారంగా చేసుకుని మహిళలు నాయకులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్, కల్వకుంట్ల సంజయ్, ఎమ్మెల్సీ ఎల్.రమణ, మాజీ ఎమ్మెల్యేలు విద్యాసాగర్‌రావు, సుంకె రవిశంకర్, రసమయి బాలకిషన్, కోరుకంటి చందర్, మనోహర్‌రెడ్డి, పుట్ట మధు, బాల్క సుమన్, నాయకులు రాజేశం గౌడ్, చల్మెడ లక్ష్మీనరసింహారావు, నారదాసు లక్ష్మణరావు, తోట ఆగయ్య, కర్ర శ్రీహరి, రాగిడి లక్ష్మారెడ్డి, రవీందర్‌రావు, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, దావ వసంత, రాకేశ్, తుల ఉమ, కోలేటి దామోదర్, హరీశ్ శంకర్, పొన్నం అనిల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జోష్‌నింపిన బైక్ ర్యాలీ

అంతకుముందు కేటీఆర్‌కు ఘనస్వాగతం పలికిన గులాబీ నాయకులు మంకమ్మతోట సత్యనారాయణ స్వామి ఆలయం నుంచి బైపాస్ రోడ్డులోని వీ కన్వెన్షన్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. సమావేశ మందిరం నాయకులతో కిక్కిరిసిపోయింది. కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల నుంచి భారీగా కార్యకర్తలు, నాయకులు తరలిరావడంతో బైపాస్ రోడ్డుపై ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. మొత్తానికి కేటీఆర్ రాకతో బీఆర్ఎస్ నాయకుల్లో కొత్త జోష్ నిండింది.

న్యూస్‌రీల్

ప్రజలకు అవసరమైన ఆరోగ్య సేవలు అందించాలి



బీర్‌పూర్‌లో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాస్

సారంగాపూర్: ప్రజలకు అన్నిరకాల వైద్యసేవలను అందుబాటులోకి తీసుకొచ్చినప్పుడే వైద్య సిబ్బంది, ఆస్పత్రికి గుర్తింపు వస్తుందని డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. ఆదివారం బీర్‌పూర్ మండలకేంద్రంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో ఆయన వైద్య సిబ్బందితో సమావేశమయ్యారు. బీర్‌పూర్ ఆస్పత్రిని త్వరలో కేంద్రప్రభుత్వ పరిధిలోని జాతీయ నాణ్యత ప్రమాణాల బృందం ఆన్‌లైన్ వెరిఫికేషన్ చేపట్టనుందన్నారు. గర్భిణులు, ఇమ్యూనైజేషన్, అందుబాటులో ఉన్న మందులు, ఓపీ, ల్యాబ్ టెస్ట్, టీబీ పరీక్షలు, లెప్రసీ, జ్వర పరీక్షలు, ఈఎన్‌టీ, బీపీ, మధుమేహం తదితర అంశాలపై చర్చించారు. జాతీయ బృందం ఆస్పత్రిని బెస్ట్‌గా గుర్తించడానికి రోగులకు మరిన్ని సేవలు చేయడంతోపాటు, ఆస్పత్రి నిర్వహణ మెరుగ్గా ఉండాలని సూచించారు.

మందుల నిల్వ ఉండాలి

జగిత్యాల: ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన సేవలు అందించాలని, మందుల నిల్వ ఉండేలా చూసుకోవాలని శ్రీనివాస్ అన్నారు. టీఆర్ నగర్‌లోని బస్తీ దవాఖానాను తనిఖీ చేశారు. ఆయన వెంట డాక్టర్లు ఉన్నారు.

ఆదివారం ఆటవిడుపు



ఎస్సారెస్పీ డీ53 కాలువలో దూకుతున్న చిన్నారులు

బుగ్గారం: ఎండలు ముదురుతుండడంతో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. దీంతో వేసవితాపం మొదలైంది. మండలంలోని యువకులు, చిన్నారులు వేసవితాపం నుంచి ఉపశమనం కోసం బుగ్గారం శివారులోని డీ-53 కాలువలో ఈతకొడుతూ ఇలా సేదతీరుతూ కనిపించారు. ఆదివారం కావడంతో పెద్దసంఖ్యలో చిన్నారులు తరలివచ్చారు.

అథ్లెటిక్స్ పోటీల్లో గురుకులం విద్యార్థుల ప్రతిభ



రజత పతకం సాధించిన స్వాతికాంజలి

జగిత్యాల: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లాకేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థిని మామిడాల స్వాతికాంజలి రజత పతకం సాధించింది. ఆదివారం హైదరాబాద్‌లోని గౌడీయం స్పోర్ట్స్‌పియాలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో బాలికల విభాగంలో 400 మీటర్ల పరుగుపందెంలో రజత పతకం సాధించింది. విద్యార్థినిని అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ముత్తయ్యరెడ్డి, అంజయ్య, రాందాస్, కొమురయ్య, ప్రిన్సిపల్ శ్రీలత, హరిరాంనాయక్ అభినందించారు.

జగిత్యాల వాసికి రాష్ట్ర మహిళా శక్తి పురస్కారం



పురస్కారం అందుకుంటున్న అడువాల సుజాత

జగిత్యాలటౌన్: జిల్లాకేంద్రానికి చెందిన ప్రము ఖ రచయిత్రి, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు అడువాల సుజాత సాహిత్య రంగంలో చేస్తున్న కృషికి రాష్ట్రస్థాయి మహిళాశక్తి పురస్కారం అందుకున్నారు. ఆదివారం మహబూబ్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ తెలు గు శాఖ పూర్వ అధ్యక్షుడు, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి మనోజు బాలాచారి చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. సుజాత సాహితీ ప్రస్థానంతోపాటు సామాజిక సేవలను వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో రచయిత్రి చుక్కాయపల్లి శ్రీదేవి, రావూరి శ్రీమతిరావు, కవులు, రచయిత్రులు పాల్గొన్నారు. సుజాతను జగిత్యాల బల్దియా మా జీ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, కళాశ్రీ సాహితీ వేదిక నిర్వాహకులు గుండేటి రాజు, కవయిత్రులు మద్దెల సరోజన, కటుకం కవిత, చిందం సునీత, అయిత అనిత, లక్కరాజు శ్రీలక్ష్మి, ఓదెల గంగాధర్, శ్యాంసుందర్ అభినందించారు.

పంట నష్టపరిహారానికి కృషి

- పంటల పరిశీలనలో ప్రభుత్వ విప్



రాయపట్నంలో వరి పొలాలను పరిశీలిస్తున్న విప్ అడ్లూరి

ధర్మపురి/బుగ్గారం: అకాలవర్షంతో నష్టపోయిన పంటలకు పరిహారం ఇప్పించేందుకు కృషి చేస్తామని, రైతులు అధైర్యపడొద్దని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. అకాలవర్షంతో పంటలు నష్టపోయిన రైతుల పొలాలను ఆదివారం రైతులతో కలిసి సందర్శించారు. మండలంలోని రాయపట్నంలో మొక్కజొన్న, వరిపొలాలను పరిశీలించారు. చేతికందిన పంట ఇలా నేలపాలు కావడం బాధాకరమన్నారు. పంటల నష్టం విలువను అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. గ్రామంలో 1480 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని రైతులు తెలిపారు. బుగ్గారంలో వివిధ రైతుల పంటపొలాలను ఆయన పరిశీలించారు. దెబ్బతిన్న వరి, మొక్కజొన్న, మామిడి పంటల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వేముల సుభాష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

వచ్చేనెల నుంచి సన్న బియ్యం

- ఉగాది రోజున పంపిణీ ప్రారంభం
- జిల్లాలో 3.10లక్షల మంది రేషన్‌కార్డుదారులు

గొల్లపల్లి: పేదలకు రేషన్‌కార్డులపై సన్నబియ్యాన్ని ఉగాది నుంచి పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. గతంలోనే సన్నబియ్యం పంపిణీకి ఏర్పాట్లు చేసినా కొన్ని అనివార్య కారణాలతో వాయిదా వేసింది. తాజాగా ఉగాది నుంచి అందిస్తామని ప్రకటించింది. ఈ పథకం ద్వారా జిల్లాలో 3,10,545 రేషన్ కార్డుదారులకు లబ్ధి చేకూరనుంది. జిల్లాలో 587 రేషన్‌దుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో 3,10,585రేషన్ కార్డులు ఉన్నాయి. ఇందులో 14,483 అంత్యోదయ, 146 అన్నపూర్ణ కార్డులున్నాయి. కార్డుదారులకు ప్రతినెలా ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున 9,369 టన్నుల బియ్యం పంపిణీ అవుతోంది. ఈనెల 30న సన్నబియ్యం పథకాన్ని సీఎం రేవంత్ రెడ్డి పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సొంత నియోజకవర్గమైన హుజూర్‌నగర్, సూర్యాపేట జిల్లాలో ప్రారంభించనున్నారు.

రీ సైక్లింగ్ నిరోధానికే..

పేదలకు ఉచితంగా సరఫరా చేస్తున్న దొడ్డు బియ్యం చాలా మంది భోజనానికి ఉపయోగించడం లేదని, దళారులు కిలోకు రూ.10 నుంచి రూ.20 చొప్పున కొనుగోలు చేసి రీసైక్లింగ్ చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పేదలు తినగలిగే నాణ్యమైన బియ్యాన్ని ఇస్తేనే రీ సైక్లింగ్ అక్రమాలను అరికట్టవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. వానాకాలం సీజన్ నుంచి సన్నధాన్యం సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. సన్న బియ్యం సాగు చేసి విక్రయించిన రైతులకు క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ కూడా చెల్లిస్తోంది. ఇలా వచ్చిన సన్నవడ్లను మర ఆడించి ఆయా పౌరసరఫరాల గోదాంలకు సరఫరా చేసి అక్కడినుంచి రేషన్ దుకాణాల ద్వారా లబ్ధిదారులకు అందించనున్నారు.

రైతులను ఆదుకుంటాం

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



హైదర్‌పల్లిలో నష్టపోయిన పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్: అకాల వర్షాలు, ఈదురుగాలులతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్, గుత్రాజ్‌పల్లి, అనంతారం, హైదర్‌పల్లి, కండ్లపల్లి గ్రామాల్లో అకాల వర్షాలతో నష్టపోయిన పంటలను ఆయన పరిశీలించారు. రెవెన్యూ, వ్యవసాయాధికారులతో వెంటనే నష్టపోయిన పంటలను గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపి రైతులకు పరిహారం అందేలా కృషి చేస్తామన్నారు. అకాల వర్షాలతో నష్టపోయిన పంటలను వెంటనే అధికారులు గుర్తించి నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ మంగళారపు మహేశ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జున్ను రాజేందర్, గాజంగి నందయ్య, లైశెట్టి శేఖర్, వెంకట్, లైశెట్టి విజయ్ ఉన్నారు.

క్లుప్తంగా

వ్యక్తి ఆత్మహత్య

వేములవాడఅర్బన్: మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్‌కు చెందిన సున్నపు మోహన్(32) ఆదివారం మూలవాగులోని ఓ చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందాడు. మోహన్ మద్యానికి బానిసై ఉరివేసుకున్నట్లు తెలిపారు. తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు



గాయపడ్డ రాములు

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలోని ప్రగతినగర్(కొంతంవాడ) ప్రాంతానికి చెందిన రాములు రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన లారీ ఢీకొన్న ప్రమాదంలో గాయపడ్డాడు. అదే సమయంలో రాములుకు గుండెపోటు రాగా స్థానికులు సీపీఆర్ చేసిన అనంతరం స్థానిక ఆస్పత్రికి తరలించారు. స్థానికంగా ప్రాథమిక చికిత్స చేసిన వైద్యులు.. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. దీంతో బాధితుడిని హైదరాబాద్‌లోని మరో ఆస్పత్రికి తరలించారు.

శివంగాలపల్లిలో..

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని శివంగాలపల్లి శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. వెంకట్రావుపేటకు చెందిన సందు రంజిత్, అతని తల్లి కనకవ్వ శివంగాలపల్లి నుంచి బైక్‌పై వస్తున్నారు. సబ్‌స్టేషన్ సమీపంలో వాహనం అదుపు తప్పి కింద పడ్డారు. ఈ ప్రమాదంలో కనకవ్వకు తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరినీ వెంటనే 108 అంబులెన్స్‌లో సిరిసిల్లలోని జిల్లా ఆస్పత్రికి తరలించారు.

వ్యాన్, లారీ ఢీకొని డ్రైవర్లకు..



పడిపోయిన కర్బూజలు

మేడిపల్లి: కర్బూజ లోడ్‌తో వెళ్తున్న వ్యాన్‌ను లారీ ఢీకొట్టింది. మేడిపల్లి, మోహన్‌రావుపేట ప్రధాన రహదారిపై జరిగిన ఈ ఘటనలో వ్యాన్ బోల్తా పడి కాయలన్నీ కిందపడిపోయాయి. రెండు వాహనాల డ్రైవర్లకు గాయాలయ్యాయి. ఎస్సై శ్యాంరాజ్ సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. పడిపోయిన వాహనాలను క్రేన్ సహాయంతో తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

అవగాహన లోపం.. లేబర్ కార్డుకు దూరం

- ఉమ్మడి జిల్లాలో 3.3 లక్షలకు మించని కార్డులు
- ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్న కార్మికులు
- అవగాహన కల్పిస్తే మరింత మందికి ప్రయోజనం

కరీంనగర్	1,15,705
పెద్దపల్లి	84,974
జగిత్యాల	76,146
సిరిసిల్ల	54,739
మొత్తం	3,31,564

2014 నుంచి ఇప్పటి వరకు..

క్లెయిమ్‌లు: 49,795

చెల్లించిన డబ్బు: రూ.22,76,82,588



నమూనా లేబర్‌కార్డులు

కరీంనగర్‌టౌన్: ఉమ్మడి జిల్లాలో కార్మికులకు తమ హక్కుల గురించి అవగాహన లేకపోవడంతో లేబర్ కార్డులకు దూరమవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా కనిపిస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల కోసం చాలా పథకాలు అమలులోకి తెస్తుండడంతో ఇప్పుడిప్పుడే కార్డులు పొందేందుకు ఆసక్తి చూపుతున్నప్పటికీ.. ప్రభుత్వం తరఫున కూడా అవగాహన కల్పించడంలో విఫలం అవుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాలు, చిన్న పట్టణాల్లో కార్మికులు సాధారణంగా లేబర్ కార్డుల గురించి అవగాహన పొందడం చాలా కష్టంగా ఉంటుంది. ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలు మరింత విస్తృతంగా చేపట్టాల్సిన అవసరం ఉంది.

ఉమ్మడి జిల్లాలో 3.3 లక్షల కార్డులే..

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 30 లక్షల పైగా జనాభా ఉండగా, ఇందులో 70 శాతం మంది వివిధ రంగాల్లో కార్మికులుగా పనిచేస్తున్నారు. అంటే దాదాపు 20 లక్షల పైచిలుకు కార్మికులు ఉండగా కేవలం 3.3 లక్షల మంది మాత్రమే లేబర్ కార్డులు పొందడం గమనార్హం. ఈ గణాంకాలను చూస్తే కేవలం 10 శాతం లోపు మాత్రమే ఈ కార్డులు పొందారని తెలుస్తోంది.

అర్హులు తీసుకోవాలి



వివిధ రంగాల్లో కార్మికులుగా పనిచేస్తున్న అర్హులందరూ లేబర్ కార్డులు తీసుకోవాలి. కార్డులు లేని చాలా మంది అత్యవసర పరిస్థితుల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లేబర్ కార్డులపై ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేసి, కార్మికులందరికీ కార్డులు అందేలా చర్యలు చేపట్టాలి.

\- కన్నం లక్ష్మణ్, కార్మిక సంఘం నాయకుడు

నిరంతరం అందజేస్తున్నాం



లేబర్ కార్డు పొందేందుకు నిర్ణీత గడువు అంటూ ఏమీ లేదు. కార్మికులుగా పనిచేస్తూ రాష్ట్ర ప్రభుత్వ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరి దరఖాస్తును పరిశీలించి అర్హులందరికీ లేబర్ కార్డులు అందజేయడం జరుగుతుంది. 3.3 లక్షల మంది ఇప్పటి వరకు కార్డులు కలిగి ఉన్నారు. మిగతా జిల్లాలతో పోల్చితే మనం మెరుగ్గా ఉన్నాం. కార్మికులకు అవగాహన కల్పించి మరింత మంది కార్డులు పొందేలా ప్రోత్సహిస్తాం.

\- వెంకటరమణ, డిప్యూటీ లేబర్ కమిషనర్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా

లేబర్ కార్డు పొందితే ప్రయోజనాలు

- ➡ లేబర్ కార్డు ఉన్న వ్యక్తి కూతుళ్ల పెళ్లికి రూ.30,000, ప్రసవానికి రూ.30,000 (ఇద్దరు కూతుళ్లకు మాత్రమే) ఒక సంవత్సరం ముందు బోర్డు నందు కార్మికుడు/కార్మికురాలుగా నమోదైనవారికి మాత్రమే ఇది వర్తిస్తుంది.
- ➡ ప్రమాదం వల్ల చనిపోతే బాధిత కుటుంబానికి రూ.6,30,000, సాధారణ మరణానికి రూ.1,30,000 ఆర్థికసాయం అందుతుంది.
- ➡ కార్మికునికి దహన సంస్కార ఖర్చుల కోసం రూ.30,000 అందిస్తారు.
- ➡ ప్రమాదవశాత్తు అంగవైకల్యం కలిగినవారికి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు పరిహారం అందజేస్తారు.
- ➡ తాత్కాలిక వైద్య ఖర్చుల కింద కార్మికులకు నెలకు రూ.4,500 చొప్పున గరిష్ఠంగా రూ.13,500 సహాయం అందుతుంది.

ప్రజాస్వామ్య విలువలకు పెద్దపీట



మాట్లాడుతున్న మంత్రి ప్రభాకర్, పక్కన కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ గౌస్ ఆలం

- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్‌అర్బన్: తమ ప్రభుత్వం రాజ్యాంగ పరిరక్షణకు, ప్రజాస్వామ్యానికి కట్టుబడి పని చేస్తోందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వం తరఫున జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో టీఎన్జీవో ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఇఫ్తార్ విందు కార్యక్రమం జరగగా మంత్రి హాజరై మాట్లాడారు. తమతోపాటు సమాజం బాగుండాలన్న కోరికతో రంజాన్ మాసంలో ముస్లింలు ఉపవాస దీక్ష పాటిస్తారని తెలిపారు. ఈద్ వేడుకలకు ఎలాంటి లోపాలు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రజాపాలన కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, తెలంగాణలో అభివృద్ధి కార్యక్రమాలు, పథకాలు విజయవంతం అయ్యేలా ముస్లింలు ప్రార్థించాలని కోరారు. ఈ నెల 25న ముఖ్యమంత్రి హైదరాబాదులో ఇఫ్తార్ విందులో పాల్గొంటారని పేర్కొన్నారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, కరీంనగర్‌లో ఎలాంటి భేదభావాలు లేకుండా అందరూ కలిసి ఉంటారని, భవిష్యత్తులోనూ ఇలాగే ఉండాలని ఆకాంక్షించారు. రంజాన్ నేపథ్యంలో జిల్లాలోని అన్ని ఈద్గాలు, మసీదుల వద్ద అవసరమైన ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ, రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, అడిషనల్ కలెక్టర్లు ప్రఫుల్‌దేశాయ్, లక్ష్మీకిరణ్, ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్, ట్రైనీ ఐపీఎస్ వసుంధర, ఆర్డీవో మహేశ్వర్, టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

కేడీసీసీబీ సేవలు భేష్



మాట్లాడుతున్న సురేంద్రమోహన్

- సహకార శాఖ కమిషనర్ సురేంద్రమోహన్

కరీంనగర్‌అర్బన్: కేడీసీసీబీ సేవలు ప్రశంసనీయమని, మరింత పురోగతి సాధించాలని రాష్ట్ర సహకార శాఖ కమిషనర్, రాష్ట్ర సహకార సంఘాల రిజిస్ట్రార్ కె.సురేంద్రమోహన్ అన్నారు. ఆదివారం నుస్తులాపూర్ ప్యాక్స్‌తో పాటు కేడీసీసీబీలను సందర్శించారు. 2025 అంతర్జాతీయ సహకార సంవత్సర ప్రాధాన్యతతో పాటు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకులు, వివిధ సహకార రంగ సంస్థలు చేపట్టాల్సిన అంశాలపై దిశానిర్దేశం చేశారు. పెద్దమొత్తంలో రుణాలిచ్చే స్థాయికి ఎదగడం హర్షణీయమని, దేశానికే తలమానికంగా కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నిలుస్తోందని కొనియాడారు. ఇక్కడి మంచి విధానాలను రాష్ట్రమంతా పాటించేలా చూడాలన్నారు. రాష్ట్రంలోని కృషి విజ్ఞాన కేంద్రాలు, ఉద్యానవన శాఖలు, మార్కెటింగ్ శాఖ, వివిధ సహకార రంగ సంస్థలను అనుసంధానం చేసి రైతుల ఉత్పత్తులను సమీకరించి, అధిక లాభాలు అందేలా పనిచేయించాలన్నారు. ఆర్థిక అక్షరాస్యత కేంద్రాల ద్వారా గ్రామీణ ప్రజానీకానికి నగదు రహిత లావాదేవీల నిర్వహణ, బ్యాంకులు అందించే వివిధ సేవల గురించి విస్తృత అవగాహన కల్పించాలన్నారు. సంఘాల ద్వారా జన ఔషధి కేంద్రాలను ప్రతీ మండల కేంద్రంలో స్థాపించి సభ్యులకు, ప్రజలకు చౌకగా లభించే మందులు విక్రయించాలని వివరించారు. కేడీసీసీ బ్యాంకు ముఖ్యకార్యనిర్వాహణాధికారి సత్యనారాయణరావు మాట్లాడుతూ, ఇటీవల నిర్మించిన గోదాముల్లో మిగులు సామర్థ్యాన్ని ఎఫ్‌సీఐ, సివిల్ సప్లయి, మార్కెటింగ్ శాఖ, రైస్ మిల్లులు ఉపయోగించుకొనుటకు ప్రభుత్వపరంగా అనుమతులు ఇచ్చి సంఘాలకు అద్దెల రూపంగా డబ్బు వచ్చేలా చూడాలన్నారు. అదనపు కమిషనర్ జి.శ్రీనివాస్‌రావు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా సహకార అధికారులు, ఎస్.రామానుజచార్యులు, సి.శ్రీమాల, మనోజ్‌కుమార్, రామకృష్ణ, సహకార అధికారులు, మార్క్‌ఫెడ్ అధికారులు, డీసీఎంఎస్ అధికారులు, బ్యాంకు జనరల్ మేనేజర్లు, సీనియర్ అధికారులు, బ్రాంచ్ మేనేజర్లు, సహకార సిబ్బంది పాల్గొన్నారు.

గ్యాస్‌కట్టర్‌లో చేయి ఇరుక్కుని..



గాయపడిన బాలుడు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగొల్లపల్లిలో గ్రాస్‌కట్టర్‌లో ఇరుక్కొని చేయి తెగిన సంఘటన చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు. మండలంలోని రాచర్లగొల్లపల్లికి చెందిన నిమ్మత్తుల మధుకర్‌రెడ్డి–రజిత దంపతుల పెద్ద కుమారుడు సుదర్శన్‌రెడ్డి(11) ఆదివారం సెలవు కావడంతో తన తాతతో కలిసి ఆవుల షెడ్డు వద్దకు వెళ్లాడు. ఆవుల కోసం పచ్చిగడ్డిని తన తాత కట్టర్‌లో వేస్తుండగా పక్కనే ఉన్న బాలుడు సైతం వేసేందుకు ప్రయత్నించగా చేయి ఇరుక్కుంది. బాలుడు కేకలు వేయడంతో అప్రమత్తమైన తాత మిషన్‌ను ఆపివేసి బాలుడి చేతిని బయటకు తీశాడు. అయితే అప్పటికే మోచేతి కింది భాగం వరకు నుజ్జునుజ్జు అయ్యింది. వెంటనే ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. మోచేతి వరకు తొలగించారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

పాలకుర్తి(రామగుండం): కొత్తపల్లి గ్రామంలో వేల్పుగొండ కొమురయ్యకు చెందిన గూన పెంకుటిల్లు ఆదివారం విద్యుదాఘాతంతో దగ్ధమైంది. స్థానికుల కథనం ప్రకారం.. కొమురయ్యతోపాటు కుటుంబసభ్యులు ఉదయం పొలం పనులకు వెళ్లారు. ఇంట్లోంచి పొగ, మంటలు రావడాన్ని గమనించిన స్థానికులు.. కొమురయ్య కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఆ తర్వాత పెద్దపల్లిలోని అగ్నిమాపక సిబ్బందికీ సమాచారం చేరవేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది స్థానికుల సాయంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ప్రమాదంలో ఇంటి నిర్మాణం కోసం దాచుకున్న రూ.2లక్షలతోపాటు 5తులాల బంగారం, గృహోపకరణాలు, బట్టలు పూర్తిగా కాలిపోయినట్లు బాధితుడు రోదిస్తూ తెలిపాడు.

పుణ్యస్నానానికి వెళ్లి పరలోకాలకు..

- గోదావరిలో మునిగి యువకుడి మృతి



విఘ్నేష్ (ఫైల్)

వెల్గటూర్ : గోదావరిలో పుణ్యస్నానాలకు వెళ్లి ప్రమాదవశాత్తు గోదావరిలో మునిగి యువకుడు మృతి చెందిన సంఘటన వెల్గటూర్ మండలం కోటిలింగాలలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం కరీంనగర్‌కు చెందిన శ్రీమంతుల విఘ్నేష్ (32) ఆదివారం సెలవు దినం కావడంతో తన భార్యతో కలిసి కోటిలింగాల వద్దగల గోదావరిలో పుణ్యస్నానాలకు వచ్చారు. గోదావరిలో ఈత కొడుతుండగా ప్రమాదవశాత్తు మునిగి మృతిచెందాడు. భార్య కళ్ల ముందే భర్త నదిలో మునిగి మృతి చెందడంతో భార్య కన్నీరుమున్నీరుగా విలపించింది. మృతుడి భార్య శ్రీలత ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు.

రేషన్‌బియ్యం పట్టివేత




పోలీసులు పట్టుకున్న రేషన్ బియ్యం

వీణవంక(హుజూరాబాద్): అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుండగా మండలంలోని రెడ్డిపల్లి గ్రామ శివారులో ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాలు.. ఇద్దరు వ్యక్తులు వ్యాన్‌లో రేషన్ బియ్యం తీసుకొని కరీంనగర్ వైపు వస్తుండగా వాహనాన్ని తనిఖీ చేయడంతో 160క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. హుజూరాబాద్ మండలం శాలపల్లికి చెందిన వ్యాన్ డ్రైవర్ గద్దల రవి, జమ్మికుంటకు చెందిన తాడేం రమేశ్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన బ్రహ్మోత్సవాలు

- 11 రోజుల్లో 98.26 లక్షల ఆదాయం



ధర్మపురి దేవస్థానం

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహుని బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి. స్వామివారి ఆలయంలో ఈనెల 10 నుంచి 22వరకు వైభవంగా నిర్వహించారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. 11 రోజులపాటు సాగిన బ్రహ్మోత్సవాల్లో భక్తుల కోసం వివిధ శాఖల అధికారులు ఏర్పాట్లు చేశారు. చలువ పందిళ్లు, తాగునీరు, మరుగుదొడ్లు, స్త్రీలు బట్టలు మార్చుకునేందుకు గదులు ఏర్పాటు చేశారు. జాతర సందర్భంగా చెత్తాచెదారం కనిపించకుండా పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించారు.

రూ.98.26 లక్షల ఆదాయం

బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారికి రూ.98.26 లక్షల ఆదాయం సమకూరింది. సుమారు 70 వేల మందికి అన్నప్రసాద వితరణ చేశారు. అందరి సహకారంతో బ్రహ్మోత్సవాలను విజయవంతం చేశామని ఆలయ ఈవో శ్రీనివాస్ తెలిపారు. భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు, రైస్‌మిల్లర్స్, దాతలు, మున్సిపల్, పోలీస్, ట్రాన్స్‌కో సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

మూడునెలల కష్టం బుగ్గిపాలు



వాహనంలో కాలిపోయిన వస్తువులు తీస్తున్న బాధితులు

వీణవంక(హుజూరాబాద్): జాతరలో స్వీట్ దుకాణం పెట్టుకొని కాలం వెల్లదీస్తున్న ఆ కుటుంబం రోడ్డునపడింది. మూడునెలల పాటు వివిధ జాతరలు తిరిగి వచ్చిన డబ్బుతో తమ వాహనంలో ఇంటికి రాగా షార్ట్‌సర్క్యూట్‌తో మూడునెలల కష్టం బుగ్గిపాలైన ఘటన వీణవంక మండలం మామిడాలపల్లి గ్రామంలో జరిగింది. వివరాలు.. నిదానం మహేందర్ వివిధ జిల్లాల్లో ఎక్కడ జాతర జరిగినా అక్కడ స్వీట్ దుకాణం పెట్టి బతుకు వెల్లదీస్తున్నాడు. మూడునెలల క్రితం తన ట్రాలీ ఆటోలో కుటుంబ సభ్యులతో కలిసి జాతర్లకు వెళ్లాడు. తిమ్మాపూర్ మండలం నల్లగొండ జాతర చూసుకొని శనివారం రాత్రి ఇంటికి చేరుకున్నాడు. అప్పటికి మహేందర్ కుటుంబం అలిసిపోవడంతో స్వీట్‌కు సంబంధించిన ముడిసరుకులతో పాటు, రూ.2.16లక్షలు తన ఆటోలో ఉంచి ఇంట్లో నిద్రపోయాడు. ఆటో పైన ఉన్న విద్యుత్ వైరు గాలికి తెగి ఆటోలో ఉన్న వస్తువుల మీద పడటంతో ముడి సరుకులతో పాటు నగదు కాలిపోయాయి. వేకువ జామున చూసేసరికి అప్పటికే నష్టం జరిగిపోయిందని బాధితుడు విలపించాడు. ఉన్న ఆధారం బుగ్గిపాలైందని, ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నాడు.

మే 20న సింగరేణిలో టోకెన్ సమ్మె

- ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య

గోదావరిఖని: సింగరేణి బొగ్గు గనుల సంస్థపై కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా మే 20న టోకెన్ సమ్మె నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ తెలిపారు. ఆదివారం గోదావరిఖనిలోని బీ– గెస్ట్‌హౌస్‌లో జరిగిన యూనియన్ కేంద్ర ఆఫీస్ బేరర్లు, బ్రాంచి కార్యదర్శుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి బకాయిపడ్డ రూ.35 వేల కోట్లు వెంటనే చెల్లించాలన్నారు. కొత్త గనులు వస్తేనే సింగరేణికి మనుగడ ఉంటుందని, అందుకు రాష్ట్రప్రభుత్వం కృషి చేయాలన్నారు. సింగరేణికి నూతన గనులు వచ్చేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. అలవెన్సులపై ఆదాయపు పన్ను మినహాయింపు, సొంతింటి పథకం అమలు, 11 రకాల అలవెన్సులను పెంచడం, డిస్మిస్ కార్మికులకు మళ్లీ ఉద్యోగాలు ఇచ్చేందుకు, మారుపేర్లు, విజిలెన్స్ బాధితుల డిపెండెంట్లకు ఉద్యోగాలు ఇవ్వాలనే డిమాండ్ల పరిష్కారానికి వెంటనే కమిటీ వేయాలని అన్నారు. సమావేశంలో గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ నాయకులు ముస్కె సమ్మయ్య, మడ్డి ఎల్లాగౌడ్, ప్రకాశ్, కవ్వంపల్లి స్వామి, అక్బర్‌అలీ, జూపాక రాంచందర్, ఆరెల్లి పోశం, జీగురు రవీందర్, మందల రాంచంద్రారెడ్డి, బాజీసైదా, ఎస్.తిరుపతి, వై.రాంగోపాల్, కొట్టె కిషన్‌రావు, ఎం.కొమరయ్య తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇళ్లలో చోరీ



పగులగొట్టి ఉన్న బీరువా తలుపులు

వెల్గటూర్ : తాళంవేసిన ఇళ్లలో దొంగలు దొంగతనం చేసిన ఘటన మండలంలోని పైడిపల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామంలోని గుడికందుల తిరుపతి, రాజేశం ఇళ్లలో శనివారం రాత్రి దొంగలు పడి బీరువా తాళాలు పగులగొట్టారు. తిరుపతి ఇంట్లో రెండున్నర తులాల బంగారం, రాజేశం ఇంట్లో నుంచి రూ.80వేలు ఎత్తుకెళ్లారు. తిరుపతి వ్యాపార నిమిత్తం కరీంనగర్‌లో, రాజేశం ముంబయిలో ఉంటున్నారు. వారిళ్లలో ఎవరూ లేకపోవడాన్ని గమనించిన దొంగలు చొరబడి బంగారం, నగదు దోచుకెళ్లారు. ఆదివారం ఉదయం ఇరుగుపొరుగు వారు చూసి ఇంటి యజమానులకు సమాచారం ఇచ్చారు. వారువచ్చి చూసి బీరువా తాళాలు పగుల గొట్టి ఉండడం, అందులో బంగారం, నగలు దొంగలు దోచుకెళ్లినట్లు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని డాగ్ స్క్వాడ్‌ను, క్లూస్ టీంను రప్పించి వివరాలు సేకరించారు.

గొడ్డలితో దాడి చేసిన సంఘటనలో వ్యక్తికి గాయాలు

చందుర్తి(వేములవాడ): చందుర్తి మండలం సనుగుల గ్రామానికి చెందిన నేరేళ్ల రాజుగౌడ్ అనే వ్యక్తి ఆదివారం రాత్రి జరిగిన గొడ్డలి దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు. చందుర్తి మండలంలోని సనుగుల గ్రామానికి చెందిన గౌడ సంఘం సభ్యులు ఆదివారం సమావేశమయ్యారు. సమావేశం ముగిసి ఇంటికి వెళ్తుండగా ఏగోళపు ప్రభాకర్‌గౌడ్‌కు, నేరేళ్ల రాజుగౌడ్‌కు మధ్య వివాదం తలెత్తింది. ఈ గొడవలో ఒకరిపై ఒకరు చెయ్యి చేసుకున్నారు. ఆవేశానికి లోనైనా ప్రభాకర్ గౌడ్ అక్కడే ఉన్న గొడ్డలితో రాజుగౌడ్‌పై దాడిచేశాడు. ఈ దాడిలో చేతికి, వీపులో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వేములవాడ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షలు నిర్వహించి చేయి విరిగిందని తెలిపారు.

పోలీసుల అదుపులో దొంగలు

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం బాలపల్లి గ్రామానికి చెందిన మడపతి గంగారాం ఇంట్లో చోరీకి పాల్పడిన దొంగలను పోలీసులు పట్టుకుని విచారణ చేపడుతున్నట్లు సమాచారం. దొంగతనానికి పాల్పడుతున్న సమయంలో సీసీ ఫుటేజీలో ఓ వ్యక్తి రికార్డు కావడంతో సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను గుర్తించినట్లు తెల్సింది.

రాజన్నా శరణు..శరణు







వేములవాడ: రాజన్నను ఆదివారం 30 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు కోడెమొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం బద్దిపోచమ్మకు బోనం మొక్కు చెల్లించుకున్నారు.